క్లుప్తంగా

సాయిశ్రీకి 'నృత్య కల్కి' అవార్డు ప్రదానం


సాయిశ్రీని అభినందిస్తున్న వీరేంద్రచౌదరి, జగదీశ్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఏ డింప్ సాయిశ్రీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాల స్థాయి కాకినాడ వేదికగా అక్టోబర్ 21న నిర్వహించిన రాగ రస తరంగిణి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపుడి నృత్య ప్రదర్శనలో జూనియర్ విభాగంలో ప్రతిభ చాటింది. దీంతో నృత్య కల్కి బిరుదుతో పాటు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ మేరకు సాయిశ్రీని త్రివేణి పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, గొల్లపూడి జగదీశ్, సీఆర్ఓ కాట్రగడ్డ మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌సింగ్, వైవీ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న క్లబ్ నిర్వాహకులు

పాల్వంచ: ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థినికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. ములకలపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన వర్స ఉష ఢిల్లీ పాండచ్చేరి యూనివర్సిటీలో ఎంఏ రెండో సంవత్సరం చదువుతోంది. కాగా పేదరికం వల్ల అక్కడి హాస్టల్ ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉంది. సామాజిక సేవా కార్యకర్త ప్రశాంత్ ద్వారా సామాజిక మాధ్యమంలో విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు స్పందించారు. శుక్రవారం రూ.5వేల నగదును ఉషకు అందించేందుకు ప్రశాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సీహెచ్.బ్రహ్మాచారి, ఆరుద్ర సత్యనారాయణ, నవీన్, చాట్ల శ్రీనివాస్, పుట్ట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా


హరగోపాల్ శర్మ

ఇల్లెందు: తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలని జరిగిన ఎన్నో ఆందోళనల్లో పాల్గొని కేసుల పాలై జైలు జీవితం గడిపిన తన లాంటి ఉద్యమకారులకు బీఆర్ఎస్ మేనిఫెస్టోలో చోటు కల్పించలేదని తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు హరగోపాల్ శర్మ ప్రకటించారు. శుక్రవారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ ఆకాంక్షలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ప్రభుత్వం సాగుతోందని పేర్కొన్నారు. అలాంటి పార్టీలో కొనసాగలేక రాజీనామా చేసినట్లు తెలిపారు.

ఓసీలో వార్షిక భద్రత పక్షోత్సవాలు


కార్మికులకు బహుమతులు అందజేస్తున్న దామోదర్‌రావు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో వార్షిక భద్రత పక్షోత్సవాలు జరిగాయి. శుక్రవారం జేకే ఓసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పని స్థలంలో ఏకాగ్రతతో మెలగాలని, రక్షణ పనిముట్లు ధరించాలని, రక్షణపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ పూర్ణచందర్, శివప్రసాద్, చిన్నయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సోలార్ ప్లాంట్‌లో జరిగిన రక్షణ పక్షోత్సవంలో జీఎం వర్క్‌షాప్ ఎస్.దామోదర్‌రావు పాల్గొన్నారు. ఆవశ్యకతను వివరించారు. సోలార్ ప్యానల్స్, కేబుల్స్, ఇన్వర్టర్ రూమ్‌లను తనిఖీ చేశారు. కార్మికులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా జీఎం జాన్‌ఆనంద్, రాజీవ్‌కుమార్, చంద్రలింగం, శ్యామ్‌ప్రసాద్, రవి, శ్రీనివాస్, నర్సింహారాజు, విజయ శేఖర్ బాబు, వీరా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం

- పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి
- కొత్తగూడెం నియోజకవర్గంలో 253 పోలింగ్ స్టేషన్లు
- మొత్తం ఓటర్లు 2,36,903 మంది


విద్యానగర్‌లోని ఓ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండలాధికారులు

చుంచుపల్లి: వచ్చే శాసనసభ ఎన్నికలకు అధికార యంత్రం సమాయత్తమవుతోంది. ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల ఎంపిక, సిబ్బంది నియామకం వంటివి ఇప్పటికే పూర్తయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు పోలింగ్ కేంద్రాలలో వసతులను సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న ఓటర్ల జాబితాను దృష్టిలో పెట్టుకొని ఈ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లలో వసతులు ఏర్పాటు చేస్తున్నారు. దూరప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు ప్రయాణ సౌకర్యంపై అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇక వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు తరలించడం, వారికోసం ర్యాంపులు నిర్మిస్తున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్‌తో పాటు తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను సమకూర్చేలా చర్యలు చేపట్టారు. ఎన్నికల నిమిత్తం విధులకు హాజరైన సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల ఏర్పాట్లను చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ పనులను ఎన్నికల కోసం ప్రత్యేకంగా నియమించిన అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

పోలింగ్ సిబ్బందికి అవగాహన...

నవంబరు 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల అధికారులైన ఆర్వోలు, ఏఆర్వోల నియామకంతో పాటు సిబ్బంది కేటాయింపు పూర్తయింది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. పోలింగ్ సమయంలో ఎదురయ్యే సమస్యలను వారికి ఉన్నతాధికారులు వివరిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అయితే పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించి వనరులను సమకూరుస్తున్నారు. గత ఎన్నికల్లో ఎదురైన పలు సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈసారి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా పల్లెల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్ల వంటి వాటిని ఏర్పాటు చేసేందుకు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దివ్యాంగులు, వృద్ధులు నేరుగా పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటేసేందుకు ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. వీరి కోసం ప్రత్యేక వీల్‌చైర్లను అందుబాటులో ఉంచనున్నారు. అటు పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. దూరభారంగా ఉన్న గ్రామాల్లో ఓటర్లను తరలించే రవాణా సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ప్రత్యేక అధికారి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. 117 కొత్తగూడెం నియోజకవర్గంలో మొత్తం ఐదు మండలాల విస్తరించి ఉన్నాయి. ఇందులో సుజాతనగర్, చుంచుపల్లి, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ ఉన్నాయి. వీటి పరిధిలో 137 ప్రాంతాల్లో 253 పోలింగ్ కేంద్రాలను అధికారులు అందుబాటులో ఉంచారు. సుజాతనగర్‌లో 24 కేంద్రాలు, చుంచుపల్లి 41 కేంద్రాలు, కొత్తగూడెంలో 66 కేంద్రాలు, లక్ష్మీదేవిపల్లిలో 32 కేంద్రాలు, పాల్వంచలో అత్యధికంగా 90 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,36,903 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 1,21,886, పురుషులు 1,14,995, ఇతరులు 22 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 6,891 మంది అధికంగా ఉన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ, మండలంలో కలిపి అత్యధికంగా 85,785 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల చివరి వరకు ఎన్నికల సంఘం కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించడంతో మరికొందరు ఈ జాబితాలో చేరే అవకాశం ఉంది.

నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్లు

మండలం	ఓటర్లు		
సుజాతనగర్	21,148	కొత్తగూడెం	62,104
చుంచుపల్లి	37,804	లక్ష్మీదేవిపల్లి	30,062
		పాల్వంచ	85,785


పోలింగ్ కేంద్రంలో ర్యాంపు ఏర్పాటు

ఓటర్లకు ఇబ్బంది లేకుండా చర్యలు



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నాం. ఓటర్లకు,విధులు నిర్వహించే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యుత్,మంచినీరు,మరుగుదొడ్లు వంటివి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాం. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి గాలి వెలుతురు ఉండే విధంగా చూస్తున్నాం.

– మందా మంగమ్మ, ఎంపీడీఓ, చుంచుపల్లి

దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతీ పోలింగ్ కేంద్రంలో వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఓటేసేందుకు వచ్చిన వారు క్యూలో నిలబడకుండా నేరుగా ఓటుహక్కు వినియోగించుకునేలా చూస్తున్నాం. పోలింగ్ బూత్ వరకు వారిని తీసుకెళ్లేందుకు ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం సిబ్బందితో పాటు వీల్‌చైర్లను అందుబాటులో ఉంచుతాం.

– జి.సత్యనారాయణ, ఎంపీఓ

నాయకులను తండాల్లో తిరగనివ్వం..


మాట్లాడుతున్న రమేష్ నాయక్

కొత్తగూడెంటౌన్: రానున్న శాశనసభ ఎన్నికల్లో లంబాడీలకు ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో అన్యాయం జరుగుతోంది. లంబాడీలకు తగిన టికెట్లు కేటాయించకపోతే కాంగ్రెస్ నాయకులను తండాల్లో తిరగనివ్వమని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమానాయక్, జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయక్ హెచ్చరించారు. శుక్రవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నాయకుడు బెల్లయ్య నాయక్‌కు మానుకోటలో ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇవ్వాలని లేదంటే మా సత్తాను చాటుతామన్నారు. సీటు విషయంలో బెల్లయ్యనాయక్‌కు అన్యాయం జరిగిందని లంబాడీల పట్ల చులకనగా మాట్లాడటం సరికాదన్నారు. 30 ఏళ్లుగా ప్రజల మధ్య ఉంటూనే ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తున్న నేత, రాజకీయ విజ్ఞానుడు తండాలను గ్రామ పంచాయితీలుగా గుర్తించాలని సుదీర్ఘమైన పోరాటం చేసిన నాయకుడు బెల్లయ్యనాయక్ అన్నారు. ఫ్యూడల్ భావజాలంతో ఉన్న రెడ్డి, ఏ సమయంలో ఎలా మాట్లాడుతారో తెలియని అహంకారి రేవంత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో లంబాడీలు తగిన బుద్ధి చెబుతారన్నారు. జనాభా లెక్కల ప్రకారం లంబాడీలకు 10 సీట్లను కేటాయించాలని లంబాడీలకు ఎస్టీ రిజర్వు సీట్లలో 7, జనరల్ స్థానాల్లో 3 టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గోండుల టికెట్లను లంబాడీలకు కేటాయించి గోండులకు లంబాడీలకు గొడవలు పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మంగీలాల్ నాయక్, మోహన్ నాయక్, ప్రసాద్ నాయక్, రవి నాయక్, ఆశోక్ నాయక్, అంగోతు భజ్జు జాదవ్, అఖిల్‌నాయక్ పాల్గొన్నారు.

సీఎం సభ గ్రౌండ్ పరిశీలన

ఇల్లెందు: నవంబర్ 1న ఇల్లెందులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు హరిప్రియను ఆశీర్వదిస్తూ నిర్వహించే బహిరంగ సభ గ్రౌండ్‌ను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సందర్శించి పరిశీలించారు. శుక్రవారం సొసైటీ చైర్మన్ మెట్టెల కృష్ణ, కౌన్సిలర్లతో మొట్లగూడెం సీఎం సభ గ్రౌండ్‌ను పరిశీలించారు. లక్ష మందితో జరగనున్న సభను విజయవంతం చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వారా రవి, అంకెపాక నవీన్, ఎర్ర ఈశ్వర్, సురేష్ తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోండి..


ఈఓ బాబూరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చుంచుపల్లి: విద్యానగర్ గ్రామపంచాయతీలో గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా ఏజెన్సీలో గిరిజనేతరులు బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపడుతున్నారని, వాటికి అడ్డుకట్ట వేయకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రమేష్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం పలువురు ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులతో ఆయన విద్యానగర్ గ్రామ పంచాయతీ ఈఓ బాబూరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. గిరిజనేతరులు చేపడుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలను వెంటనే నిలిపివేసి గిరిజన చట్టాలైన 1/70, పెసా చట్టాలను పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంగీలాల్ నాయక్, బాదావత్ తులసీరామ్ నాయక్, రవి, పరుశురాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కోటల్ల రోడ్డు నిర్మాణం


నిర్మాణంలో ఉన్న కోటల్ల తారురోడ్డు

టేకులపల్లి: తొమ్మిదోమైలు తండా పంచాయతీ కోటల్ల గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరింది. తొమ్మిదోమైలు తండా నుంచి కోటల్లకు మూడు కిలోమీటర్లు పక్కా రోడ్డు లేక ఇక్కడ నివసిస్తున్న ఆదివాసీలు అరిగోస పడ్డారు. సాక్షిలోనూ పలుమార్లు వార్తా కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ కృషి ఫలితంగా 2023–24 ఆర్థిక సంవత్సరం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గత నెల 20న ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రధాన రహదారి నుంచి కోటల్ల గ్రామం వరకు మూడు కిలోమీటర్లు వెట్ మిక్సింగ్ మొదటి లేయర్ వేశారు. పది కల్వర్టులు నిర్మించారు. మరో లేయర్ వెట్ మిక్సింగ్, ఆ తరువాత బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. క్యూరింగ్ చేయకపోవడం వల్ల దుమ్ము ధూళి కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని, ప్రతీరోజు క్యూరింగ్ చేయాలని, నాణ్యతగా నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పీఆర్ ఏఈ నవీన్ వివరణ కోరగా.. నిబంధనల ప్రకారమే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అవసరమైనంత మేరకు క్యూరింగ్ చేస్తున్నామని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మొదటి లేయర్ పూర్తయింది. త్వరలో రెండో లేయర్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నర్సరీ నిర్వహణ పట్టదా?


బేతంపూడి నర్సరీలో ఎండిపోతున్న మొక్కలు

టేకులపల్లి: మానవ మనుగడకు చెట్లే ఆధారం. పల్లెల్లో పచ్చదనంతోనే ప్రజలకు ఆరోగ్యం, ఆనందం లభిస్తుంది. దీని కోసమే అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటుతున్న విషయం తెలిసిందే. మొక్కలను కాపాడాల్సిన వారే వాటిని నిర్లక్ష్యం చేస్తే ఎవరు ఎవరికి చెప్పుకోవాలి. వివరాలు... టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ నర్సరీలో వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు.

వాటికి నీటి సరఫరా కోసం బోరు వేసి మోటారు ఏర్పాటు చేశారు. అయితే మరోవైపు ఇదే పంచాయతీకి చెందిన జీపీ కార్యాలయం నూతన భవనం నిర్మాణం జరుగుతోంది. ఈ భవనం గోడలకు క్యూరింగ్ చేసేందుకు నర్సరీలో మొక్కలకు నీటి సరఫరా కోసం వాడుతున్న మోటారును తీసుకొచ్చి భవన నిర్మాణం వద్ద బోరులో బిగించి ఉపయోగిస్తున్నారు. దీంతో నీరు లేక నర్సరీలో మొక్కలు వడలిపోతున్నాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలిసి స్థానిక సర్పంచే కాంట్రాక్టర్‌గా మారి జీపీ ఆఫీసు నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మీనాను వివరణ కోరగా... నర్సరీలో వాడుతున్న బోరు మోటారుని జీపీ భవన నిర్మాణం వద్దకు సర్పంచ్ తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆ మోటారు మరమ్మతుకు చేరుకుంది. రిపేరు చేయించాల్సి ఉందని తెలిపారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంరూరల్: బీఆర్ఎస్ పార్టీ పేదల పార్టీ అని, సీఎం కేసీఆర్‌ప ప్రవేశపెట్టిన ప్రతి పథకం వల్ల ప్రజలు అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం, కారుకొండరామవరం, తెలగరామవరం, గడ్డిగుట్ట తదితర ప్రాంతాలలో పర్యటించారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గంలోని కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందుతున్నాయన్నారు. నా మీద ఎన్ని శక్తులు పని చేసినా, నియోజకవర్గానికి రూ.వేల కోట్లు మంజూరు చేయించి, అభివృద్ధి పనులు చేయటం జరిగిందన్నారు. వచ్చె నెల 5న కేసీఆర్ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగన్, ఎంపీపీ భూక్యా సోనా, ఎంపీటీసీ జిల్లా అధ్యక్షురాలు కొల్లు పద్మ, కార్యకర్తలు ఉన్నారు.

'సంక్షేమాన్ని' అడ్డుకోవడం కాంగ్రెస్ నైజం


మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ఇల్లెందు: రాష్ట్రంలో రైతుల పురోభివృద్ధికి అమలు చేస్తున్న రైతుబంధు లాంటి పథకాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌ను కోరటం చూస్తే రైతులపై ఆ పార్టీకున్న చిత్తశుద్ధి అర్థం అవుతోందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు పరుచూరి వెంకటేశ్వర్లు, మనోహర్ తివారీ, సుదీర్ తోట్లా, మేకల శ్యాంతో కలిసి మాట్లాడారు. ఎన్నికలను సాకుగా చూపి ప్రజాసంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ముమ్మాటికీ రైతు వ్యతిరేక పార్టీ అన్నారు. దళితుల స్వావలంబన కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని కూడా నిలిపి వేయాలని కోరటం దళితుల మీద విషం వెళ్లగక్కడమేనన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందన్నారు. 24 గంటల కరెంటు పొందుతున్న రైతులను ఎగతాళి చేసేలా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి 3 గంటలు కరెంటు ఇస్తే చాలన్నట్లు మాట్లాడారని విమర్శించారు. కాంగ్రెస్ తీరును ప్రజలంతా అవగాహన చేసుకుని బీఆర్ఎస్ పక్షాన నిలబడాలని కోరారు. లాల్‌సింగ్, అబ్దుల్ నబీ, శ్రీనివాస్, నెమలి ధనమ్మ, సనా రాజేష్ పాల్గొన్నారు.

మాలబంజరలో 308 మంది ఓటర్లు


మాలబంజర గ్రామం వ్యూ

సుజాతనగర్: మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో మాలబంజర చిన్న పంచాయతీ. రాఘవాపురం గ్రామ పంచాయతీ నుంచి 2018లో మాలబంజర నూతన పంచాయతీగా ఏర్పడింది. జనాభా 412 కాగా, ఈ గ్రామంలో మొత్తం 308 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ఎస్టీ ఓటర్లు ఎక్కువగా ఉండగా, రెండో స్థానంలో ఎస్సీ ఓటర్లు ఉన్నారు. 2019లో తొలిసారిగా సర్పంచ్ ఎన్నికల్లో మామా, కోడళ్లు పోటీ పడగా బానోత్ రాందాస్ విజయం సాధించారు. కాగా మండలంలో పెద్ద పంచాయతీ సుజాతనగర్. ఈ గ్రామంలో 3,112 మంది ఓటర్లు ఉన్నారు.

రాఘువాపురంలోనే ఓట్లు వేయాలి...

మాలబంజర ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడినా గ్రామంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయలేదు. ఇక్కడి ఓటర్లంతా 2 కిలోమీటర్లు వెళ్లి మాజీ పంచాయతీ గ్రామం అయిన రాఘువాపురం వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది.

సింగరేణి చిత్తశుద్ధి ఇదేనా..?


స్టేషన్ తడికలపూడిలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్

టేకులపల్లి: టేకులపల్లి మండలం స్టేషన్ తడికలపూడిలోని రైల్వేస్టేషన్ ఆవరణలో కోయగూడెం ఓపెన్ కాస్టుకి సంబంధించిన సింగరేణి కోల్‌యార్డు ఉండేది. ఇక్కడి నుంచి వ్యాగన్ల ద్వారా బొగ్గు రవాణా జరిగేది. దీంతో బొగ్గు ద్వారా వచ్చే దుమ్ము ధూళితో సమీప ప్రజలు అనారోగ్య పాలవుతుండేవారు. ఈ నేపథ్యంలో సుమారు ఆరు నెలల క్రితమే సింగరేణి ఆధ్వర్యంలో స్టేషన్ తడికలపూడిలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం పాతశాల వద్ద ఓ గదిని నిర్మించి ఆర్‌ఓ ప్లాంట్‌కు సంబంధించి పరికరాలు సమకూర్చారు. ఆరు నెలలు అవుతున్నా నేటికీ ఆ ప్లాంట్‌ను ప్రారంభించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి ఆర్‌ఓ ప్లాంట్‌ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలి


సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 30న అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల్లో పోటీ చేయాలని ఆసక్తి ఉన్న ఉద్యోగులు తమ ఉద్యోగానికి రాజీనామా చేయాలని సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు రాజకీయాలకు అతీతంగా తటస్థంగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఏ వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం, రాజకీయ పదవి కలిగి ఉండరాదనే నిబంధనల మేరకు ఎవరూ ఉద్యోగం చేస్తూ, ఎన్నికల్లో పోటీ చేయకూడదని ఉత్తర్వులో పేర్కొంది. అంతేకాకుండా ఎవరైనా ఉద్యోగం చేస్తూ పార్లమెంట్, అసెంబ్లీ, మున్సిపాలిటీ, పంచాయతీ టెరిటోరియల్ కాన్స్టిట్యూయన్సీ వంటి పదవులు కలిగి ఉండటం మూలంగా సాధారణ విధులు నిర్వహించటం ఇబ్బంది అవుతుందని, కొన్ని సందర్భాలలో సదరు ఉద్యోగి వెళ్లిపోతే విధుల్లో ఉన్నవారిపై పనిభారం పడుతుందని భావించిన కంపెనీ నామినేషన్ల ప్రక్రియకు ముందుస్తుగా ఈ ఉత్తర్యులు జారీ చేయటం జరిగింది. ఈ నేపథ్యంలో నామినేషన్ల కంటే ముందే బేషరతుగా సదరు ఉద్యోగి తాను చేస్తున్న ఉద్యోగానికి ఆయా హెచ్ఓడీలకు కానీ, ఏరియా జీఎంలకు కానీ రాజీనామా అందజేయాలని సూచించారు. అంతే కాకుండా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి ఎలాంటి సెలవులు మంజూరు ఉండదు కాబట్టి రాజీనామా చేసి పోటీ చేయవచ్చు. ఒకసారి రాజీనామా ఆమోదం పొందితే, ఒకవేళ ఎన్నికల్లో ఓడిపోతే మళ్లీ ఉద్యోగానికి రాకూడదని, ఎన్నికల్లో గెలిచి తన పదవీ కాలం పూర్తయిన తరువాత కూడా ఉద్యోగం పొందే అవకాశం ఉండదు. ఈ నిబంధనలను అతిక్రమించిన ఉద్యోగులపై కంపెనీ స్థాయి క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

రికవరీ సరే.. బాధ్యులపై చర్యలేవి?


రికవరీ చేసిన ఐరన్ చానల్స్‌తో సింగరేణి సెక్యూరిటి సిబ్బంది (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే – 5 షాఫ్ట్‌కు సంబంధించిన సుమారు 4 టన్నుల ఐరన్ చానల్స్‌ను గతనెల 10న కార్పొరేట్ ఏరియా చీఫ్ సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులు ఆధ్వర్యంలో పట్టుకొని రికవరీ చేశారు. సంబంధిత రైస్ మిల్లుపై కొత్తగూడెం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ బాధ్యులైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం విచారకమని కార్మికులు చర్చించుకుంటున్నారు. సుమారు రూ.రెండు లక్షల విలువ గల ఐరన్ చానల్స్(కొత్తవి) పీవీకే – 5 షాఫ్ట్ నుంచి తిప్పనపల్లి రైస్ మిల్లుకు ఎలా, ఎప్పుడు వెళ్లాయి. ఆ సమయంలో డ్యూటీలో ఎవరున్నారు. పీవీకే – 5 షాఫ్ట్ గని మెయిన్ గేట్ వద్ద మూడు షిఫ్టులలో ముగ్గురు ప్రైవేట్ సెక్యూరిటీలు ఉంటారు. మూడు షిఫ్టులో జమేదార్‌తో సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుంటారు. ఇంత కట్టుదిట్టమైన భద్రత ఉండగా సుమారు 4 టన్నుల ఐరన్ చానల్స్ తిప్పనపల్లికి ఎలా చేరుకున్నాయి. వీరందరూ విధుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉంటే వీరిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవటంలో గల ఆంతర్యమేమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఏరియాలో సరిపడా సిబ్బంది, ఇంటిలిజెన్స్, స్పెషల్ పార్టీ సిబ్బంది నిద్రమత్తు వీడేటట్లు కార్పొరేట్ ఏరియా సీనియర్ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని విధుల పట్ల వారి అంకిత భావాన్ని ప్రదర్శించారు. కానీ ఈ విషయంలో ఇంత వరకు ఎవరిపై కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో ఎవరైనా ఉన్నతాధికారి హస్తం ఉందా..? లేదా మరేదైనా రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి భాగస్వామ్యం ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఏది ఏమైనా ఈ ఘటనపై చర్యలు తీసుకోకపోవటం వారిని పరోక్షంగా అనుమతిస్తున్నట్లేనని కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కార్పొరేట్ జీఎం సెక్యూరిటీ బీఆర్ దీక్షితులును సాక్షి వివరణ కోరగా... మా సిబ్బంది మెటీరియల్‌ను రికవరీ చేసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాము. బాధ్యులను గుర్తించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.